VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 303

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 19 ఏప్రిల్ 2026




## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి వి ఎల్ ఎన్ చక్రవర్తి..





**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా మోపిదేవి మండలం మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభు దేవాలయం శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నీ శనివారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి వి ఎల్ ఎన్ చక్రవర్తి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బుద్ధ పవన్ కుమార్ శర్మ అర్చకులు బుద్ధ సతీష్ శర్మ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు అనంతరం స్వామి వారి నాగపట్టలో పాలు పోసి మూలవిరాట్ అయిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు అనంతరం ఆలయ సూపర్మెంటు అచ్యుత మధుసూదన్ రావు స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు మోపిదేవి తాసిల్దారు హరినాథ్ మరియు మోపిదేవి ఎస్సై గౌతమ్ కుమార్ పాల్గొన్నారు.

# మహిళా బిల్లును అడ్డుకోవటం ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డే

● రిజర్వేషన్ బిల్లు అడ్డుకుని జాతికి ద్రోహం చేశారు ● మహిళల్ని ఓటు అడిగే పార్టీలు వారి సాధికారతను ఎలా అడ్డుకుంటాయి

● నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు







**నిడదవోలు,కలంకౌంటర్ :** పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష పార్టీలు జాతికి ప్రత్యేకించి మహిళలకు ద్రోహం, అన్యాయం చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ బిల్లును అడ్డుకున్నందుకు నిరసనగా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలతో కలిసి సీఎం ఈ నిరసన ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టుకుని నడిచారు. మహిళా బిల్లును అడ్డుకున్న రోజును ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు మహిళా ద్రోహులని పేర్కొన్నారు. మహిళా సమాజానికి ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పార్టీలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల్ని ఓటు బ్యాంకుగా చూసే రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని సీఎం అన్నారు. మూడు దశాబ్దాల మహిళా రిజర్వేషన్ కలను ప్రతిపక్ష పార్టీలు చెరిపేశాయని పేర్కొన్న ముఖ్యమంత్రి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటం మహిళలకు ద్రోహం చేయడమేనని అన్నారు. ఎన్డీఏ పక్షాలతో కలిసి నిరసన ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ .." భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఓ బ్లాక్ డే. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని సుదీర్ఘ కల సాకారం అవుతుందని భావించాం. పార్లమెంటు, అసెంబ్లీలోనూ 33 శాతం మంది మహిళల్ని ప్రజాప్రతినిధులుగా చూస్తామని అనుకున్నాం. మహిళల్ని గౌరవించటం భారత సంస్కృతి లో భాగం. నిన్న పార్లమెంటులో దీనికి భిన్నంగా జరిగింది. విపక్షాల వైఖరికి నిడదవోలులో ఎన్డీఏ పక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించాం. మహిళలంతా బయటకు వచ్చి వారికి నిరసన తెలియాలని పిలుపు ఇస్తున్నాను. దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని, హోం మంత్రి పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చారు. 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెప్పారు. ఏపీలో కూడా 50 శాతం మేర సీట్లు పెరుగుతాయి. ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ అజెండా కోసం ఈ దుర్మార్గం చేశాయి. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నాం. దీనిని అడ్డుకోవటం క్షమించరాని నేరం. ఆడబిడ్డలంటే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలకు ఇంత చులకనా.?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

**విద్రోహంపై ఇంటింటికీ ప్రచారం..** "నిన్న జరిగిన విద్రోహాన్ని ప్రతీ ఇంటికి తీసుకెళ్తాం. ఇవాళ చేపట్టిన నిరసన ఆరంభం మాత్రమే. దీనిపై పవన్ కల్యాణ్‌నూతో మాట్లాడాను. ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలి. మహిళలను ఓటు అడిగే పార్టీలు మహిళా సాధికారతను అడ్డుకుంటాయా? 2017లో టీడీపీ అధికారంలో ఉండగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించాం. కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు బిల్లు కూడా తీసుకు రాలేక పోయారు. 2029లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతోనే సవరణ బిల్లు తీసుకు వచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని పార్టీలన్నీ ఈ బిల్లుకు 2/3 మంది సభ్యుల మద్దతు రాకుండా అడ్డుకున్నాయి. దక్షిణాదికి, ఉత్తరాది రాష్ట్రాలకు ఆన్యాయం జరుగుతుందని ఏవోవో ఆరోపణలు సాకులు చెప్పారు. లేని పోని సాకులతో బిల్లును డిఫీట్ చేయటం శోచనీయం. ప్రజలు ఎన్నుకుంటేనే చట్టసభల్లోకి వచ్చిన వారు మహిళలకు ద్రోహం చేయటం సరికాదు. జనాభాలో సగం ఉన్న మహిళలు ఏ రంగంలో అయినా సమర్ధంగా పనిచేస్తున్నారు. అలాంటి మహిళలు చట్ట సభలకు వస్తే న్యాయం జరుగుతుందనే ఈ సవరణ బిల్లు తీసుకువచ్చారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకున్నారు. ఏ ముఖం పెట్టుకుని మహిళల్ని ఆ పార్టీలు ఓట్లు అడుగుతాయి.? ఆ పార్టీలు చేసిన ద్రోహానికి డిపాజిట్ కూడా రాకుండా చేయాలి. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేకే ఈ బిల్లును అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై ప్రతీ ఒక్కరిని చైతన్యం చేసేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం". అని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ పక్షాలు నిర్వహించిన నిరసన ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీ ఎన్ మాధవ్, జనసేన తరపున మంత్రి కందుల దుర్గేష్, నిమ్మల రామా నాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

## నారా లోకేష్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వల్లపోతు





**విజయవాడ, కలంకౌంటర్ :** మంత్రి నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన సందర్భంగా ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్, రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వల్లపోతు వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అత్తులూరి సుబ్బు, ప్రకాశం జిల్లా వాసవి సేవాదళ్ చైర్మన్ అమరా భానుప్రకాష్, జరుగుమల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోటా కిషోర్ బాబు వీరందరూ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్, జాతీయ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతిని డుండి రాకేష్ ఆధ్వర్యంలో కలిసి నారా లోకేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.



## పాయకరావుపేట పట్టణంలో అన్నా క్యాంటీన్ను ప్రారంభించిన హోం మంత్రి అనిత

● క్యాంటీన్‌లో భోజనాలను స్వయంగా వడ్డించి, స్థానిక ప్రజలతో కలిసి భోజనం చేసిన మంత్రి





**పాయకరావుపేట,కలంకౌంటర్ :** పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట పట్టణంలో రూ.61 లక్షల వ్యయంతో నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను మంత్రి అనిత ప్రారంభించారు. అనంతరం క్యాంటీన్‌లో భోజనాలను స్వయంగా వడ్డించి, స్థానిక ప్రజలతో కలిసి భోజనం చేశారు. భోజనాల నాణ్యతపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, పేదవారికి మంచి భోజనం అందించడం అన్నా క్యాంటీన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను రద్దు చేసి పేదలకు భోజనం దూరం చేసిందన్నారు. 2019--2024 మధ్య కాలంలో వాటిని రాజన్న క్యాంటీన్లుగా అయినా కొనసాగించాలని కోరినా స్పందన లేకపోయిందని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, పట్టణాలతో పాటు గ్రామీణ మండలాల్లో కూడా వీటిని విస్తరిస్తున్నామని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి అడ్డరోడ్డు సమీపంలో మరో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాయకరావుపేటలోని సరయ్య చెరువు వద్ద స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. 'జలం--జీవం' నినాదంతో చెత్త తొలగింపు కార్యక్రమంలో స్వయంగా పాల్గొని, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. సరయ్య చెరువును అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన ఆమె, చెరువును శుభ్రపరచి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.

## పవన్ కల్యాణ్‌కు తీవ్ర అస్వస్థత... హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో శస్త్రచికిత్స



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శనివారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం ఉదయం అధికారులతో సమావేశంలో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. వ్యక్తిగత వైద్యుల సూచన మేరకు శుక్రవారం నాటి అధికారిక కార్యక్రమాలను కూడా పవన్ కళ్యాణ్ రద్దు చేసుకున్నారు. ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలతో పాటు ఎంఆర్ఐ కూడా నిర్వహించారు. రిపోర్టులను సమీక్షించిన వైద్యులు, శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించి విజయవంతంగా పూర్తి చేశారు. వారం నుంచి పది రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న తర్వాత పవన్ కళ్యాణ్ తిరిగి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని వైద్యులు తెలిపారు. అయితే, ఆయన పూర్తిస్థాయిలో కోలుకోవడానికి గణనీయమైన సమయం పడుతుందని, దీర్ఘకాలికంగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వివరాలను జనసేన అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కాగా, పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో శస్త్రచికిత్స నిర్వహించినట్టు తెలుస్తోంది.

## ప్రభుత్వ ఆసుపత్రి కి రూ 29,000లు విలువైన సామగ్రి మధిర మధు బహూకరణ



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా, తెలుగుదేశం పార్టీ నాయకులు మధిర మధు తన తండ్రి మాజీ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రెసిడెంట్ మధిర వీరబ్రహ్మాచారి జ్ఞాపకార్థం ఏరియా ఆసుపత్రికి ?29,000 విలువ చేసే వైద్య సామగ్రిని అందజేశారు. ఆసుపత్రికి అవసరమైన నెబులైజర్లు, డ్రెస్సింగ్ బిన్స్, రెండు వోల్టాస్ వాటర్ కూలర్లు ఆసుపత్రి వినియోగార్థం సమర్పించబడినవి. ఆసుపత్రి సేవల మెరుగుదలకు ఈ సామగ్రి ఉపయోగపడుతుందని ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ఇంద్రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు , మధిర మధు చేసిన సేవలను అభినందిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కందుకూరు ఏరియా ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రి స్థాయికి తీసుకెళ్తా - ఎమ్మెల్యే ఇంటూరి!

● త్వరలో 300. పడకల ఆసుపత్రి గా ఏరియా ఆసుపత్రి ఉన్నతీకరణ చెందనుంది ● వైద్యులు ప్రిస్క్రిప్షన్ అర్థమయ్యేలా వ్రాయాలి ● ఏదో ఒక రోజు ఏరియా ఆసుపత్రిని రాత్రి వేళల్లో తప్పక ఆకస్మికంగా సందర్శిస్తా!



**కందుకూరు, కలంకౌంటర్ :** వైద్యులు ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మానవీయ విలువలతో, సమగ్రమైన వైద్యాన్ని అందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మధ్యాహ్నం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏరియా ఆసుపత్రి త్వరలోనే 300. పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరణ చెందుతుందని, కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో అధునాతన వైద్య సేవలు అందిస్తుందని ఆయన తెలిపారు. పేదలకు సమున్నతమైన వైద్యాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధమ్యమని ఎమ్మెల్యే ఇంటూరి అన్నారు. వైద్యులు ప్రిస్క్రిప్షన్ అర్థమయ్యేలా రాయాలన్నారు. వైద్యులు నైట్ డ్యూటీలు క్రమం తప్పకుండా చేయాలని, రాత్రి వేళల్లో ఏదో ఒక రోజు తప్పక ఏరియా ఆసుపత్రిని తాను ఆకస్మికంగా సందర్శించడం జరుగుతుందని ఆయన తెలిపారు. వైద్యశాలలో అన్ని వైద్య పరీక్షలు, మందులు పేదలకు సంపూర్ణంగా అందేలా చూడాలన్నారు. వైద్యశాల ఆవరణలో పచ్చదనాన్ని ఇంకా పెంచాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణికి సూచించారు. అనంతరం ఆయన క్యాజువాలిటీ వార్డు, ప్రసూతి వార్డు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, డయాలసిస్ యూనిట్ తదితర గదులను క్షుణ్ణంగా పరిశీలించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను రోగులను, వారి బంధువులను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉన్నదని వాకబు చేశారు. మందులు., వైద్య పరీక్షలు ఉచితంగా అందుతున్నాయా? లేదా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్యేతర సిబ్బంది కందుకూరు ఏరియా ఆసుపత్రి ప్రతిష్టను పెంచేలా పనిచేయాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఇరువురు సీనియర్ పాత్రికేయులు వైద్యశాల లోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, దీనిపై ఆయన స్పందిస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి ని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్యేతర సిబ్బంది, ఆసుపత్రి కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై ఐదో రోజు అవగాహన కార్యక్రమం



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శనివారం బంటుమిల్లి అగ్నిమాపక అధికారి జి రామ్ మోహన్ రావు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది బంటుమిల్లిలోని పెట్రోల్ ఫీలింగ్ స్టేషన్లో సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధమైన చర్యలు తీసుకోవాలి ఎలా ప్రాణాలతో బయటపడాలని అనే విషయాలు మీద డెమో నిర్వహించారు. అలాగే బంటుమిల్లి అగ్నిమాపక స్టేషన్ పరిధిలో మునిపెడ లోఉన్న మిల్లేష్ మెరైన్ ఎక్స్పోర్ట్ కంపెనీలో సిబ్బందికి, అలాగే కృత్తి వెన్నులో ఉన్న ఆనంద ఎంటర్ప్రైజెస్ కృష్ణ సంస్థ సిబ్బందికి యాజమాన్యాలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు డెమో నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

# జలధారబి,జలహారతి కార్యక్రమం లో మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రతి 3వ శనివారం నిర్వహిస్తున్న "స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం జిల్లా పరిషత్ సెంటర్‌లో నిర్వహించిన "జలధార -- జలహారతి" కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర ,కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ , ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే దుర్గా ప్రసాద్ , మాజీ మున్సిపల్ ఛైర్మన్ బాబా ప్రసాద్ ,కూటమి నాయకులు, కార్యకర్తల తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సెంటర్‌లోని మంచి నీటి చెరువు పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

# కేసుల సత్వర పరిష్కారానికి మీడియేషన్ సెంటర్ ను ఉపయోగించుకోండి....

## -కృష్ణాజిల్లా ఇన్చార్జి జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వర్లు...







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రోజు రోజుకి పెరిగిపోతున్న కేసుల సత్వర పరిష్కారానికి మీడియేషన్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని కృష్ణాజిల్లా ఇన్చార్జి జిల్లా జడ్జి మరియు జిల్లా పోక్సోకోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కృష్ణా జిల్లా కోర్టు ప్రాంగణం లో న్యాయ సేవా సదనం లో న్యాయమూర్తులు న్యాయవాదులు మీడియేటర్స్ కక్షిధారులతో సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాజుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీడియేషన్ ద్వారా కేసులు పరిష్కారానికి న్యాయవాదులు పూర్తి సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు. మీడియేషన్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఉభయ పార్టీలకు సమయము, డబ్బు ఆదాఅవుతుందని, కోర్టులు పై ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. మారుతున్న కాలానుగుణంగా మీడియేషన్ సెంటర్ యొక్క ప్రాముఖ్యత జాతీయ స్థాయిలో అంతర్జాతీయ స్థాయిలో పెరిగిందని అన్నారు. జిల్లా న్యాయసే వాధికారి సంస్థ కార్యదర్శి కే.రామకృష్ణయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు హైకోర్టు దేశ స్థాయిలో మీడియేషన్ ద్వారా అత్యధిక కేసులు పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలియజేశారు.కృష్ణా జిల్లా వ్యాప్తంగా విజయవాడ తో సహా 98 మంది మీడియేటర్లు ప్రత్యేక శిక్షణ పొంది ఉన్నారని వారి ద్వారా గతంలో 2000 కేసులు పరిష్కారం చేసినట్లు తెలియజేశారు. కమర్షియల్ యాక్ట్ చట్ట ప్రకారం దాఖలు చేసే కేసులన్నీ కూడా ముందస్తుగా ప్రీ మీడియేషన్ కేసులుగా దాఖలు చేసుకోవాలని అన్నారు. న్యాయమూర్తులు న్యాయవాదులు సమన్వయంతో మీడియేషన్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని అన్నారు. మచిలీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ సి హెచ్. యుగంధర్, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, సీనియర్ న్యాయవాదులు గరిమేళ్ళ ప్రభాకర్ రావు, గంజి నాగేంద్రరావు మీడియేషన్ పై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎస్.సుజాత బార్ అసోసియేషన్ కార్యదర్శి శయన సుధాకర్ న్యాయమూర్తులు న్యాయవాదులు పాల్గొన్నారు

# మూగజీవాలకు కూడా చలివేంద్రాలు కల్పించాలి

**● 20 ఏళ్లుగా చలివేంద్రం నిర్వహణ ● మదర్ తెరిసా సేవా సమితి గౌరవ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ**



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పురస్కరించు కుని మూగజీవాలైన పక్షులకు పశువులకు కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మచిలీపట్నం నవచైతన్య మదర్ తెరిసా సేవాసమితి గౌరవ అధ్యక్షులు బాలాజీ పిలుపునిచ్చారు. సమితి 20 సంవత్సరాల వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం 15వ డివిజన్ నగరి చెన్నయ్య మార్కెట్లో చలివేంద్రాన్ని లంకి శెట్టి బాలాజీ మచిలీపట్నం మార్కెట్ మాజీ చైర్మన్ మరకాని పరబ్రహ్మంతో కలిసి ప్రారంభించారు. గత 20 సంవత్సరాలుగా సమితి ఆధ్వర్యంలో కొన్ని వందల సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసి చిలకలపూడి సెంటర్లో ఎనిమిది అడుగుల మదర్ తెరిసా విగ్రహాన్ని ఏర్పాటు చేసే అవకాశం సమితికి దక్కిందని బాలాజీ అన్నారు. సమితి ద్వారా అనేక రక్తదాన శిబిరాలు కుష్టువ్యాధి కలిగిన వారికి చేయూత 20 సంవత్సరాలుగా చలివేంద్రాలు ఏర్పాటు పేద విద్యార్థులకు ఫీజులు పుస్తకాలు అందించడం వంటి పలు కార్యక్రమాలు నిర్వహించి సమితి గుర్తింపు పొందిందని బాలాజీ అన్నారు మదర్ తెరిసా స్ఫూర్తితో సమితి అధ్యక్ష కార్యదర్శులు పైడిపాముల గురు ప్రసాద్ కుమ్మరి జలా చంద్రుడు నిరంతరం సేవలందిస్తూ ప్రజలను పొందారని అన్నారు. సమితి సేవా కార్యక్రమాలను అధ్యక్షులు గురు ప్రసాద్ తెలియజేశారు. రాబోయే రోజులలో క్షేత్రస్థాయిలో పేదవారికి మరింత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని శిబిరాలు ఏర్పాటు చేస్తామని కార్యదర్శి జలచంద్రుడు అన్నారు. మరకాని పరబ్రహ్మం మాట్లాడుతూ ఎవరి వద్ద చందాలు అడగకుండా తమ సొంత నిధులతో 20 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమని అన్నారు. గత 20 సంవత్సరాలుగా ప్రతి వేసవికి నగిరి చెన్నయ్య మార్కెట్లో క్రమం తప్పకుండా చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ కూల్ డ్రింక్స్ ను మంచినీళ్లను పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా గత 20 సంవత్సరాలుగా సమితిలో విశిష్ట సేవలు అందించిన 12 మందికి లంకిశెట్టి బాలాజీ మెమెంటోళ్లు అందజేసి రిక్షా కార్మికులకు కండువాలు పంపిణీ చేశారు. సమితి అధ్యక్షులు పైడిపాముల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

# భవన నిర్మాణం పూర్తి చేయండి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** వెనకబడిన తరగతుల బాలికల వసతిగృహ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి విద్యార్థినులకు అందుబాటులోకి తేవాలని జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర రావు కు,కృష్ణాజిల్లా బి.సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం శనివారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2022వ సంవత్సరంలో నాడు నేడు పథకం కింద స్వర్గీయ మహాత్మ జ్యోతిరావు పూలే వెనకబడిన తరగతుల బాలికల వసతి గృహం కు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. అయితే సంబంధిత హాస్టల్ భవంతిని పునాదుల వరకు నిర్మాణం చేసి నిలిపివేయడం జరిగిందన్నారు. దీనిపై సంబంధిత ఉద్యోగులను వివరణ అడుగుగా నిధులు పూర్తిగా మంజూరు కానందున నిర్మాణ పనులు ఆగినట్లుగా తెలిపారన్నారు. కాబట్టి జిల్లా కలెక్టర్ డీ.కే బాలాజీ భవంతి నిర్మాణానికి కావాల్సిన నిధులను తక్షణ మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుని హాస్టల్ నిర్మాణాన్ని పూర్తిచేసి వెనుకబడిన కులాల విద్యార్థినులకు త్వరలోనే అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు డి.ఆర్.ఓ చంద్రశేఖరరావు కు కృష్ణాజిల్లా బి.సి సంక్షేమ సంఘం తరపున వినతిపత్రం సమర్పించినట్లుగా సుబ్రమణ్యం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోగి శివ,భోగిరెడ్డి సుభాని, నిక్కు రాధాకృష్ణ,బెల్లం కొండ రవి, అమీన్,తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు,కలంకౌంటర్ :** మున్సిపాలిటీకి తాగునీటిని అందించే రామతీర్థం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను అధికారులు, నేతలతో కలిసి ఎమ్మెల్యే నాగేశ్వరరావు పరిశీలించారు. పంప్ హౌస్ కు వెళ్లి, నీటిని ఫిల్టర్ చేసే విధానాన్ని గమనించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ చుట్టూ వాతావరణన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు... జమ్ము, ఇతర వ్యర్థాలు తొలగిస్తున్న పనులను ఎమ్మెల్యే నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా, అధికారులు నేతలతో కలిసి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం మరియు పర్యావరణ నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. భూగర్భ జలాలను పెంచడం, నీటివనరులను సద్వినియోగం చేసుకోవడంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే చెరువులు, కుంటలకు నీరు వచ్చే కాలువలలో గుర్రపుడెక్క, చెత్త తొలగించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గుర్రపు డెక్క వృధాగా పారేయకుండా, దాంతో సేంద్రియ ఎరువులు, ఇతర ఉపయోగకరమైన వస్తువులు తయారు చేసుకునే విధానాన్ని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, డిఈ గణపతి, పట్టణ టిడిపి అధ్యక్షుడు మల్లేశ్వరరావు, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, ఏపీఈడబ్ల్యుఐడీ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీను, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, నియోజవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, పార్వతి, అశ్విని, నల్లూరి సూర్యనారాయణ, నాదెండ్ల మధు, షేక్ కాలేశా, మమ్ముషా, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 45 సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉన్న నాయకునికి పదవి రావడం ఆనందదాయకం

**● వాకర్స్ అసోసియేషన్, ఆటోమొబైల్ యూనియన్, వివిధ సంఘాల ప్రతినిధులు., మరియు తెలుగుదేశం నాయకులు**





**ఉయ్యూరు,కలంకౌంటర్ :** తెదేపా జాతీయ ఉపాధ్యక్షులుగా రాజేంద్రప్రసాద్ ని నియమించిన సందర్భంగా ఉయ్యూరు లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వ కలిసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించిన వివిధ సంఘాల ప్రతినిధులు, ఆటోమొబైల్స్ యూనియన్ వారు, వాకర్ అసోసియేషన్స్ వారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 45 సంవత్సరాలుగా ప్రజలకు అనేక రకాలుగా సేవలందిస్తూ, 25 సంవత్సరాలు ప్రజాప్రతినిధిగా ఉండి ఉయ్యూరు అభివృద్ధి ప్రదాతగా పేరుగాంచిన రాజేంద్రప్రసాద్ గారికి పదవి రావడం ఆనందదాయకమని, ఆయన సర్పంచ్ గా, ఎంపీటీసీగా, జడ్పిటిసిగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా ఉయ్యూరు ప్రాంతప్రజలకు చేసిన సేవలు మరవరానివని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పులూరు పిఎసి చైర్మన్ పడవల మధుసూదన్ రావు, ఉప్పులూరు గ్రామ పార్టీ అధ్యక్షులు బుజ్జులు, కృష్ణాజిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు వసంత కుమార్, తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, ఐదో వార్డు టిడిపి అధ్యక్షులుఉయ్యూరు గణేష్ , సిటీ కేబుల్ శివరామకృష్ణ, అబ్దుల్ ఖదీర్, మహమ్మద్ అన్వర్, అహ్మద్, వాకర్స్ అసోసియేషన్స్ ప్రెసిడెంట్ కోడె సాంబశివరావు, వాకర్స్ సభ్యులు...గోక శ్రీనివాసరావు, అబ్దుల్ ఖలీల్, డాక్టర్ తిరుమలరావు,నెల్లి రాంబాబు, మురళి, రమేష్ బాబు, మరియు ఉయ్యూరు ఆటోమొబైల్ వెల్ఫేర్ యూనియన్ నాయకులు అబ్దుల్ మబూద్, గఫూర్,ఫజల్,మహమూద్,ఆసిఫ్, అమన్, మొదలగువారు పాల్గొనినారు..

# జలసంరక్షణ మనందరి బాధ్యత - ఎమ్మెల్యే ఆరణి





**తిరుపతి,కలంకౌంటర్ :** జల సంరక్షణ మనందరి బాధ్యత అని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం చెన్నారెడ్డి కాలనిలోని కృష్ణమ నాయుడు పుష్కరిణి జలధార - జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించి హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శనివారం రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు జలధార - జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి శనివారం ఒక నినాదంతో ముందుకు వచ్చి ప్రజల్లో శుభ్రతపై చైతన్యం కలిగితున్నామని తెలుప్పారు. ఈ నెల వర్షపు నీటి పరిరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాల పరిరక్షణ పై ప్రజలకు అవగహన కల్పిస్తున్నామని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లో అందరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇండ్లు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి మాట్లాడుతూ నీటి పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని, నీరు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ అభివృద్ధి జరిగితుందని తెలిపారు. భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వీటిపై అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కృష్ణమ నాయుడు పుష్కరిణిలో జలధార - జలహారతి కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వేసవిలో నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయిూ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధులపై తెలంగాణ ప్రభుత్వం శుభవార్త


**తెలంగాణ, కలంకౌంటర్ :** రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెండో విడత రైతు భరోసా నిధులను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. ఈ నెల 20వ తేదీన భూపాలపల్లి జిల్లా కాటారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులను వారి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. మార్చి 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడతగా 1.50 కోట్ల ఎకరాలకు రూ.3,590 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ క్రమంలో, రైతులు రెండో విడత రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.


# మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఉదయపు నడక మిత్రమండలి ఆధ్వర్యంలో ఏడవ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .ఈరోజు మజ్జిగ దాత వేద శంకర్ రావు .ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జల్దు మురళీనాథ్ ట్రెజరర్ వేద లక్ష్మీనరసింహం కంచర్లపల్లి కృష్ణమోహనరావు వంకాయల నాగపోతరావు ఉడత్తు సురేష్ మాటూరి రామ్మోహన్ కొండూరు భద్రం తదితరులు పాల్గొన్నారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com